సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ఉద్యోగుల గ్రీవెన్స్‌ డేను శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు లోకాలకు అమ్మ.. గాజుల బొమ్మ



లక్ష డజన్ల గాజులతో అమ్మవారి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్‌: బలగ నాగావళి తీరంలోని బాలాత్రిపుర కాలభైరవ స్వామి పీఠంలో శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. లక్ష డజన్ల గాజులతో అలంకరణ చేశారు. పీఠం నిర్వాహకులు గణేష్‌ గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఏపీఎన్‌జీఓ మహాసభల పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్‌: ఏపీఎన్‌జీఓ అసోసియేషన్‌ 21వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌ స్టాంప్స్‌ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం క్యాంప్‌ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్‌ స్టేడియంలో జరగబోయే రాష్ట్ర మహాసభలకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి హాజరవుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, వైస్‌ ప్రెసిడెంట్‌ టి.సోమేశ్వరరావు, జాయింట్‌ సెక్రటరీ కేవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఐపీఆర్‌ఓగా చెన్న కేశవరావు



కలెక్టర్‌ని కలిసిన కొత్త డీఐపీఆర్‌ఓ

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: సమాచార పౌర సంబంధాల శాఖలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్‌ఓ)గా కె.చెన్నకేశవ రావు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ను కలెక్టర్‌ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం ప్రాంతీయ సమాచార ఇంజినీర్‌ కార్యాలయంలో సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయనను శ్రీకాకుళానికి పంపించారు.





వాన.. మేఘాలాపన

జిల్లా కేంద్రాన్ని గురువారం సాయంత్రం చిరుజల్లులు పలకరించాయి. రోజంతా మేఘావృతమై కనిపించినా సాయంత్రానికి వర్షం కురవడంతో వాహనదారులు, పాదచారులు కాస్త ఇబ్బంది పడ్డారు. ఆహ్లాదకర వాతావరణాన్ని మరికొందరు ఆస్వాదించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, శ్రీకాకుళం



కాంట్రాక్టు జీవితాల్లో క్రమబద్ధీకరణ క్రాంతి

- సీఎం వైఎస్‌ జగన్‌ తీసుకున్న నిర్ణయంతో కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఆనందం
- క్రమబద్ధీకరణతో జిల్లాలో 1543 మందికి మేలు
- సీఎంను వేనోళ్ల కీర్తిస్తున్న ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: 'చెప్పానంటే.. చేస్తానంతే' అని సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి మరోమారు నిరూపించుకున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో నాడు చంద్రబాబు సర్కారు నమ్మక ద్రోహం చేస్తే.. నేడు జగనన్న ప్రభుత్వం వారి జీవితాల్లో వెలుగులు నింపింది. నాడు పాదయాత్ర సందర్భంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఈ ఏడాది జూన్‌ 7వ తేదీన మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకోగా, తాజాగా ఆ ఫైల్‌పై సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసి మాట నిలబెట్టుకున్నారు. 23 ఏళ్ల కలను సాకారం చేసి కాంట్రాక్టు ఉద్యోగులకు కొత్త జీవితాన్ని అందించారు. ఏ ప్రభుత్వం చేయలేని పనిని సీఎం వైఎస్‌ జగన్‌ చేశారని ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌ను వేనోళ్ల కీర్తిస్తున్నాయి.

దశాబ్దాల నిరీక్షణకు తెర..

ఆ మధ్య 1998 డీఎస్సీ క్వాలిఫైడ్‌ ఉపాధ్యాయుల పాతికేళ్ల కలను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. ఆశలు వదులుకున్న ఉద్యోగాలను ఇచ్చి 352 మంది జీవితాల్లో వెలుగులు నింపారు. తాజాగా 23 ఏళ్ల కాంట్రాక్టు ఉద్యోగుల కల నెరవేర్చారు. తమ కాంట్రాక్టు బతుకులు ఎప్పుడు బాగుపడుతాయి, తామెప్పుడు ప్రభుత్వ రెగ్యులర్‌ ఉద్యోగులవుతామని రెండు దశాబ్దాలకు పైగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో వారిలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఇంతవరకు హామీలివ్వడం తప్ప ఆచరణలో పెట్టలేదని, పాలకులు చెప్పడమే తప్ప ఏమీ చేయరనే పరిస్థితి ఉండేదని, మొదటి సారి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిని ఇప్పుడే చూశామని కాంట్రాక్టు ఉద్యోగులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న క్రమబద్ధీకరణ నిర్ణయంతో జిల్లాలో 1543 మంది ప్రభుత్వ రెగ్యులర్‌ ఉద్యోగులుగా ఉన్నతి పొందనున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



హిరమండలం ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

హిరమండలం: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై స్థానిక హిరమండలం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలోని లెక్చరర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్‌ జగన్‌ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు.

30 శాఖల్లో 1543మందికి మేలు..

2014 ఎన్నికలకు ముందు వరకు కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వం క్రమద్ధీకరించడంతో జిల్లాలో 1543 మందికి మేలు జరుగుతోంది. ఇకపై వారంతా ప్రభుత్వ రెగ్యులర్‌ ఉద్యోగులుగా కొనసాగనున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ, మత్స్య శాఖ, పాలిటెక్నిక్‌ కళాశాల, డిగ్రీ కళాశాల, జూనియర్‌ కళాశాల, జిల్లా విద్యాశాఖ, అటవీ శాఖ, మండల విద్యాశాఖ, రిమ్స్‌, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుర్వేదిక్‌ డిస్పెన్సరీ, డిస్ట్రిక్ట్‌ లెవల్‌ ట్రైనింగ్‌ సెంటర్‌, జిల్లా కోర్టు, జిల్లా వినియోగదారుల ఫోరం, లోక్‌ అదాలత్‌, పీఆర్‌ఐ ఇంజనీరింగ్‌ విభాగం, పీఐయూ ఇంజనీరింగ్‌ విభాగం, కలెక్టరేట్‌, డ్వామా, ఐసీడీఎస్‌, భూగర్భ జల శాఖ, ఈఈ ఎస్‌పీసీఎల్‌, ఇరిగేషన్‌ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా అప్‌గ్రేడ్‌ కానున్నారు.



ఒకే కాలేజీలో 10 మందికి..



కళాశాల ఆవరణలో ఆనందం పంచుకుంటున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో 10మంది కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ జీఓతో వీరంతా రెగ్యులర్‌ ఉద్యోగులుగా మారనున్నారు. ఎం.సూర్యనారాయణ(హిస్టరీ), ఎం.సోమశేఖర్‌(బోటనీ), ఎం.గోవిందరావు (సివిక్స్‌), వై.మాధవి (ఫిజిక్స్‌), కె.లావణ్య(కామర్స్‌), ఎస్‌.జగదీశ్వరరావు(జువాలజీ), పి.రాధాకృష్ణ (ఒకేషనల్‌ కామర్స్‌), పి.రాజా సురేష్‌ (షార్ట్‌హ్యాండ్‌ ఒకేషనల్‌)కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తుండగా.. వీరంతా రెగ్యులర్‌ అయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్‌ ఇందిరాకుమారి వీరికి అభినందనలు తెలిపారు.

ఎన్నో కుటుంబాల్లో వెలుగులు



ప్రభుత్వ నిర్ణయం ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతుంది. పాదయాత్రలో ఇచ్చిన హామీని మరువకుండా హామీని నెరవేర్చారు. ఇచ్చిన మాట తప్పరని సీఎం వైఎస్‌ జగన్‌ మరోమారు నిరూపించుకున్నారు. – ఆర్‌.త్రినాథరావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్‌ అధ్యక్షుడు

రుణపడి ఉంటా



నేను 2010లో రిమ్స్‌ మెడికల్‌ కళాశాలలో కాంట్రాక్టు బేసిక్‌గా ఉద్యోగంలో చేరాను. ఇప్పటికి నాకు 13 ఏళ్ల సర్వీసు ఉంది. ఇప్పుడు సీఎం వైఎస్‌ జగన్‌ మమ్మల్ని కూడా రెగ్యులర్‌ చేయడంతో చాలా ఆనందంగా ఉన్నాం. సీఎంకు మా కుటుంబమంతా రుణపడి ఉంటాం.

– రాకోటి ఉష, రిమ్స్‌ మెడికల్‌ కళాశాల ల్యాబ్‌ టెక్నీషియన్‌

ఎవరూ చేయని సాహసం



జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సుమారు 20 ఏళ్లుగా ల్యాబ్‌ టెక్నీషియన్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాను. అప్పటి నుంచి జీవితాలు ఎప్పుడు బాగు పడతాయో అని మేమంతా అనుకునేవాళ్లం. సీఎం వైఎస్‌ జగన్‌ ఎవరూ చేయని సాహసం చేసి మమ్మల్ని ఆదుకున్నారు.

– యాళ్ల నాగభూషణరావు, ల్యాబ్‌ టెక్నీషియన్‌, సారవకోట పీహెచ్‌సీ

సబ్‌ ట్రెజరీల్లో ఎక్కువ..

జిల్లాలో సబ్‌ ట్రెజరీల వారీగా చూస్తే శ్రీకాకుళం, సోంపేట, టెక్కలి పరిధిలో ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులు లబ్ధిపొందుతున్నారు. ఒక్క శ్రీకాకుళం సబ్‌ ట్రెజరీ పరిధిలో 618 మంది ఉండగా, టెక్కలిలో 116, సోంపేటలో 116, పాతపట్నంలో 105, ఇచ్ఛాపురంలో 102, ఆమదాలవలసలో 95, నరసన్నపేటలో 75, రణస్థలంలో 75, పలాసలో 68, పొందూరులో 59, కోటబొమ్మాళిలో 57, కొత్తూరులో 57 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు నేడు మేలు జరుగుతోంది.

చంద్రబాబుదంతా మోసమే..

కాంట్రాక్టు ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని ప్రతిసారీ ఎన్నికల్లో మాటివ్వడం, ఆ తర్వాత గాలికొదిలేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది. కొంత మంది ఉద్యోగ సంఘ నాయకులను గుప్పెట్లో పెట్టుకుని విభజించు– పాలించు విధానంతో పబ్బం గడుపుకోవడం తప్ప కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్‌ను నెరవేర్చేందుకు చొరవ చూపలేదు. అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోకపోవడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్రమబద్ధీకరణ చేస్తానని చెప్పడం చంద్రబాబుకు అలవాటుగా మారిపోయింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ధర్నాలు, రాస్తారోకో, నిరసన దీక్షలెన్ని చేసినా పట్టించుకోలేదని, సీఎం జగన్‌ ఇచ్చిన మాట మేరకు ఎవరూ ఊహించని విధంగా క్రమబద్ధీకరణ ఫైలుపై సంతకం చేసి ఆశ్చర్యపరిచారని బాహాటంగానే ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. నాయకుడంటే ఇలా ఉండాలని, ముఖ్యమంత్రి అంటే ఇలా పనిచేయాలని, మాటిస్తే మడం తిప్పకూడదని, తాము చూసిన ముఖ్యమంత్రుల్లో వైఎస్‌ జగన్‌ ఒక గొప్ప ముఖ్యమంత్రి అని ఉద్యోగులు కొనియాడుతున్నారు.

హర్షణీయం



కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణలో భాగంగా 2014 జూన్‌ 2 ముందు నుంచి పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్‌ చేయడం హర్షణీయం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా దశల వారీగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం ఎంతో సంతోషం. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతి అని మరో సారి నిరూపించారు. – ఎస్‌.మోహన్‌, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌ అధ్యక్షుడు, టెక్కలి

20 ఏళ్లుగా పనిచేస్తున్నా..

ఉద్యోగాన్ని రెగ్యులర్‌ చేసి సీఎం వైఎస్‌ జగన్‌ మా జీవితాల్లో వెలుగులు నింపారు. 20 ఏళ్ల గా నేను కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ఎందరో సీఎంలను మా గురించి విన్నవించాం. వైఎస్‌ జగన్‌ మాత్రమే మా విన్నపాన్ని మన్నించారు.

– కోరాడ గోవిందరావు,మ్యాథ్స్‌ లెక్చరర్‌, ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ, కొత్తూరు

శతకోటి వందనాలు



నేను 2009 నుంచి కాంట్రాక్టు ఎకనామిక్స్‌ లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మాటిచ్చి మోసం చేశాయి. వయసైపోతోంది గానీ పర్మినెంట్‌ కావడం లేదని బాధ పడేవాళ్లం. ఇన్నాళ్లకు సీఎం వైఎస్‌ జగన్‌ మాకు మేలు చేశారు. ఆయనకు శతకోటి వందనాలు. – ఎస్‌కే ప్రసాదరావు, తెలుగు కాంట్రాక్టు లెక్చరర్‌, కోటబొమ్మాళి ప్రభుత్వజూనియర్‌ కళాశాల

తగిన సమయంలో రిటర్న్‌ గిఫ్ట్‌ ఇస్తాం..



సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డికి ఈ జన్మంతా రుణ పడి ఉంటాం. ఆయన మేలును మరువలేం. కటాఫ్‌ డేట్‌తో సంబంధం లేకుండా కాంట్రాక్టు ఉద్యోగులందరికీ మేలు చేయాలని నిర్ణయించడం చాలా గొప్ప విషయం. మా జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌కు.. తగిన సమయంలో రిటర్న్‌ గిఫ్ట్‌ ఇస్తాం. – నడిమింటి ధర్మారావు, సివిక్స్‌ సీనియర్‌ కాంట్రాక్టు లెక్చరర్‌, జీజేసీ కొయ్యాం

గ్రూప్‌–1లో మెరిసిన సిక్కోలు బిడ్డలు



తల్లిదండ్రులతో రాకేష్‌

పొందూరు: ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గ్రూప్‌–1 ఫలితాల్లో పొందూరు మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన కూన రాకేష్‌ ప్రతిభ కనబరిచారు. స్టేట్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ ఆఫ్‌ ట్యాక్సెస్‌ ఉద్యోగానికి ఎంపికయ్యారు. రాకేష్‌ తండ్రి కేవీఎం సత్యనారాయణ పిల్లలవలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి ధనలక్ష్మి గృహిణిగా ఉన్నారు.

డీఎస్పీగా ప్రదీప్తి



పేడాడ ప్రదీప్తి

ఆమదాలవలస రూరల్‌: మండలంలో కొర్లకోట గ్రామానికి చెందిన పేడాడ ప్రదీప్తి గ్రూప్‌–1 ఫలితాల్లో విజయం సాధించడంతో డీఎస్పీగా ఎంపికయ్యారు. ఏపీపీఎస్సీ ఫలితాలు గురువారం విడుదల కావడంతో ఈ ఫలితాల్లో ప్రదీప్తి తన ప్రతిభను చూపారు. ప్రదీప్తి తల్లిదండ్రులు అప్పారావు, సుగుణవేణి ఇద్దరు ఉపాధ్యాయులు కావడంతో వారి ప్రోత్సాహంతో గ్రూప్‌–1కు చదువుతూ ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం టెక్కలి సబ్‌డివిజన్‌ పరిధిలో ఎక్సైజ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు.

ట్రెజరీ ఆఫీసర్‌గా 'కోట'



కోట రాజశేఖర్‌

ఆమదాలవలస రూరల్‌: మండలంలో కలివరం పంచాయతీ తమ్మయ్యపేట గ్రామానికి చెందిన కోట రాజశేఖర్‌ గ్రూప్‌–1 ఫలితాల్లో విజయం సాధించారు. ఈ ఫలితాల్లో విజయం సాధించి ట్రెజరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. రాజశేఖర్‌ను తల్లిదండ్రులు కోట రామారావు, సీతమ్మ, గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

సత్తా చాటిన సోదరులు..



రాజేష్‌



మనోజ్‌

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరానికి చెందిన ఇద్దరు సోదరులు గ్రూప్‌ 1 ఫలితాల్లో ప్రతిభ చాటారు. పీపీఎస్‌ రాజేష్‌ డీఎఫ్‌వో ఉద్యోగానికి ఎంపికకాగా, పీపీఎస్‌ మనోజ్‌ అడ్మినిస్ట్రేటివ్‌ అధికారి(ఏవో)గా ఎంపికయ్యారు. వీరి తల్లిదండ్రులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు విశ్రాంత హాస్టల్‌ వార్డెన్‌, సుజాత టీచర్‌.

మొదటి ప్రయత్నంలోనే..



దండ శ్వేత

ఏపీహెచ్‌బీ కాలనీ వాసి దండ శ్వేత మొదటి ప్రయత్నంలో 22 ఏళ్లకే ఎంపీడీవో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈమె తండ్రి ఆనందరావు పంచాయతీ సెక్రటరీ, తల్లి విజయలక్ష్మి హిందీ లెక్చరర్‌.

సీఎం వైఎస్‌ జగన్‌ విశాల దృక్పథంతో పాలిస్తున్నారు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు





మాట్లాడుతున్న ధర్మాన సోదరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి విశాల దృక్పథంతో పరిపాలిస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో 80 అడుగుల రోడ్డులోగల ఆనందమయి ఫంక్షన్‌ హాల్లో జేసీఎస్‌ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ప్రతిపక్ష టీడీపీకి ప్రభుత్వాన్ని ఉద్దేశించి విమర్శించేందుకు ఏమీ లేక అవాస్తవాలు ప్రచారం చేస్తోందని అన్నారు. దేశం మొత్తం ధరలు పెరుగుతుంటే.. ఒక్క ఏపీలోనే పెరుగుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కరోనా సమయంలో మన ప్రభుత్వం చేసిన విధంగా ఏ రాష్ట్రంలోనూ ప్రభుత్వాలూ చేయలేదన్నారు. నేడు వైద్య వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చామన్నారు. మేలు చేసే ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వండని రానున్న యుద్ధంలో గెలిచేందుకు, గెలుపే ధ్యేయంగా పనిచేసేందుకు సన్నద్ధం కావాలని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌, తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్‌ చైర్మన్లు మామిడి శ్రీకాంత్‌, అంధవరపు సూరిబాబు, డీసీఎంఎస్‌ చైర్మన్‌ గొండు కృష్ణ, అంబటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్‌ మూకళ్ల తాతబాబు, అగ్రిమిషన్‌ మెంబర్‌ గొండు రఘురాం, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మెంటాడ స్వరూప్‌, పట్టణ అధ్యక్షులు సాధు వైకుంఠ రావుతో పాటు పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.


కిడ్నీ వ్యాధులు అరికట్టేందుకే ఉద్దానం ప్రాజెక్టు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌

హిరమండలం, మెళియాపుట్టి: ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంతో కిడ్నీ సమస్యలకు పరిష్కార మార్గం దొరుకుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌ అన్నారు. ఆయన గురువారం హిరమండలంలోని ఉద్దానం సమగ్ర మంచినీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూస్‌ చీఫ్‌ ఇంజినీర్‌ కృష్ణారెడ్డి, కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌తో కలిసి పరిశీలించారు. అలాగే ట్రయల్‌ రన్‌ పరిశీలించారు. ప్రాజెక్టు స్థితిగతుల గురించి సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నుంచి సుమారు 8గంటల సమయంలో ఉద్దానం శివారుకు నీరు చేరుతుందన్నారు. ప్రస్తుతం 90 శాతం పనులు జరిగాయన్నారు. రిజర్వాయర్‌లో నీరు, ఉద్దానంకు పంపించే నీటిలో తేడాను పరిశీలించారు. అక్టోబర్‌లో ఈ పథకాన్ని సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రూ.700 కోట్ల ఖర్చుతో 144 కిలోమీటర్ల నీటి తరలింపు గొప్ప విషయమన్నారు. ఆయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్‌ సీఈ గాయత్రి, ఎస్‌ఈ టీవీఎస్‌ ప్రసాద్‌, టెక్కలి ఆర్డీఓ సీతారామ్మూర్తి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్‌, జెడ్పీ సీఈఓ ఆర్‌.వెంకటరామన్‌, డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు తదితరులు ఉన్నారు.



మెళియాపుట్టిలో వాటర్‌ గ్రిడ్‌ ప్రాజెక్టును పరిశీలిస్తున్న రాష్ట్ర స్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీ రాజశేఖర్‌, ఇతర అధికారులు



క్లుప్తంగా

కళింగ శివంగి



వీరగున్నమ్మ సైకత శిల్పం

ఆమదాలవలస రూరల్: కళింగ శివంగి వీరగున్నమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దాడు. మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద గురువారం వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

ఆదిత్యుని కానుకల్లో ఆభరణాల లెక్కింపు నేడు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ హుండీల్లో కానుకలుగా లభించిన బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులను గోల్డ్ బాండ్ స్కీంలో భద్రపరిచే ప్రక్రియ శుక్రవారం ఉదయం చేపడుతున్నట్లు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేసారు. ఈ మేరకు దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్, జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారులు, ఆలయ పాలకమండలి సమక్షంలో ఈ ప్రక్రియ కట్టుదిట్టమైన భద్రతాచర్యల నడుమ నిర్వహిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు. స్వామి వారి మూలవిరాట్టుకు నిత్యాలంకరణతో పాటు పర్వదినాల్లో వినియోగించే ఆభరణాలు మినహాయించి, కానుకల రూపంలో లభించిన బంగారు, వెండి వస్తువులన్నింటిని లెక్కించి గోల్డ్ బాండ్ స్కీంలో పెట్టనున్నారని ప్రకటించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు శీరపు దేవేంద్ర(ఫైల్)

కవిటి: మండలంలోని రాజపురం పంచాయతీ కమలాయిపుట్టుగకు చెందిన శీరపు దేవేంద్ర(33) బుధవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కవిటి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు దేవేంద్రకు తన భార్య లలితకు గత కొన్నాళ్లుగా అంతర్గత గొడవలు ఉన్నాయి. వారికి ఐదేళ్ల పాప తన్వి కూడా ఉంది. ఈ కలహాల వల్లే దేవేంద్ర ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి శీరపు నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కవిటి ఎస్‌ఐ కె.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్గదర్శిపై సీఐడీ తనిఖీలు



తనిఖీలు జరిపి కార్యాలయం బయటకు వస్తున్న సీఐడీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, చిట్స్ రిజిస్ట్రార్ సంధ్యారాణి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలోని రామలక్ష్మణ సమీపంలోని రిలాక్స్ హోటల్ ఎదురుగా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్‌లో గురువారం మధ్యాహ్నం సీఐడీ సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. ఆయనతో పాటు సేల్స్ టాక్స్ (జీఎస్టీ), రిజిస్ట్రేషన్, విజిలెన్సు అధికారులు కూడా సాయంత్రం ఆరు గంటల వరకు వివిధ రకాల పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి సోదాలు జరిపారు. కార్యక్రమంలో జిల్లా జీఎస్టీ సేల్స్ టాక్స్ అధికారి రాణీమోహన్, నరసన్నపేట సీటీఓ, చిట్స్ రిజిస్ట్రార్ సంధ్యారాణి పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

అత్యుత్తమ పనితీరు.. అత్యున్నత గుర్తింపు

- శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ గుర్తింపు
- రాష్ట్రంలోనే ఉత్తమ పాలిటెక్నిక్ కళాశాలగా కీర్తి



ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపు పొందిన నేపథ్యంలో అధికారులను అభినందిస్తున్న సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

ఎచ్చెర్ల క్యాంపస్:

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ అత్యున్నత గుర్తింపు దక్కించుకుంది. ఎందరో ఉత్తమ మానవ వనరులను తీర్చిదిద్దిన ఈ సంస్థకు అరుదైన గుర్తింపు లభించింది. తాజాగా ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ గుర్తింపు లభించింది. రాష్ట్రంలోనే ఈ గుర్తింపు సాధించిన కళాశాలగా కీర్తి పొందింది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏటా 300 సీట్లకు ప్రవేశాలు జరుగుతున్నాయి. సివిల్, కంప్యూటర్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, సీసీపీ బ్రాంచ్‌లు ఉన్నాయి. ఉత్తీర్ణత సాధించి, రిలీవ్ అయిన విద్యార్థులకు 20 శాతం ప్లేస్‌మెంట్‌లు లభిస్తున్నాయి. 70 శాతం మంది విద్యార్థులు ఇంజినీరింగ్, ఇతర ఉన్నత విద్యలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సాంకేతిక విద్యాశాఖ డిజైన్ చేసిన కరిక్యులమ్ పక్కాగా అమలు చేస్తోంది. ఏటా చివరి సెమిస్టర్ రిలీవ్ నాటికి 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. మౌలిక వసతులు, ల్యాబ్‌లు, శిక్షణ ఉత్పత్తి కేంద్రం నిర్వహణ వంటివి పక్కాగా నిర్వహిస్తున్నారు. కళాశాలలకు అవసరమైన ఫర్నీచర్ సైతం తామే సొంతంగా ఈ కళాశాలలో తయారు చేసుకుంటారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటివి ఆదర్శంగా అమలు చేస్తున్నారు. ఎస్‌సీసీ, స్పోర్ట్స్ రిజర్వేషన్ సైతం విద్యార్థులకు ఉపయోగపడుతుంది. విద్యలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎన్‌బీఏ, పీసీటీఏ వంటి సంస్థల గుర్తింపులు ఉన్నాయి.



ఎన్‌సీసీ పరేడ్ చేస్తున్న విద్యార్థులు



శిక్షణ, ఉత్పత్తి కేంద్రం నిర్వహణలో విద్యార్థులు

రాష్ట్రంలో గుర్తింపు



రాష్ట్రంలో ఉత్తమ పాలిటెక్నిక్‌గా గుర్తింపు రావటం ఆనందంగా ఉంది. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపు విద్యా బలోపేతానికి దోహద పడుతుంది. ఇది సమష్టి కృషి. సాంకేతిక విద్యాశాఖ లక్ష్యాలు, మార్పులకు అనుగుణంగా డిప్లమా కోర్సులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇంకా ప్రత్యేక దృష్టి పెట్టి శత శాతం ఉత్తమ పాలిటెక్నిక్ కాలేజీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తాం.

– గురుగుబెల్లి దామోదర్‌రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్

పక్కాగా కరిక్యులమ్ నిర్వహణ



సాంకేతిక విద్యాశాఖ ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంగా కరిక్యులమ్ డిజైన్ చేస్తోంది. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మొదటి సెమిస్టర్ నుంచి విద్య కొనసాగుతుంది. చాలా మంది విద్యార్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్యాంపస్ డ్రైవ్‌ల్లో ఎన్నికవుతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు డిప్లమా తర్వాత ఇంజినీరింగ్ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొందరు మాత్రం ఉద్యోగాల్లో చేరుతున్నారు.

– మురళీకృష్ణ, సీనియర్ అధ్యాపకులు

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ



కళాశాలలో చేరిన నుంచి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యను అందిస్తున్నారు. ప్రత్యేక శిక్షణ సైతం ఇస్తున్నారు. క్లాస్‌వర్క్ పక్కాగా జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన సాట్రోటిక్స్ కంపెనీలో రూ. 2.4 లక్షల ప్యాకేజీతో జూనియర్ ట్రైనీ ఇంజినీర్‌గా ఎంపికయ్యాను. భవిష్యత్‌లో నైపుణ్యాలు పెంచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుంది.

– ఎస్.ఉదయ్‌కిరణ్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విద్యార్థి

• మహాలక్ష్మి ఆశీర్వాదం



ఈ వృద్ధురాలి వయసు 95 ఏళ్లు. పేరు డొక్కరి మహాలక్ష్మి. రెండు సార్లు కోవిడ్‌ను జయించారు. వృద్ధాప్యం వల్ల నడుము సహకరించకపోవడం తప్ప ఇంకెలాంటి సమస్యలు లేవు. కాశీబుగ్గ జయరామ చంద్రపురంలో మంత్రి సీదిరి అప్పలరాజు గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తూ.. ఈమెను పలకరించారు. తన కుమారులు, కుమార్తెలు, మనవలు, మునిమనవళ్లు అంతా కలిపి 80 మంది ఉంటారని చెప్పడంతో అంతా ఆశ్చర్యపోయి చూశారు. తనకు పింఛన్ చక్కగా అందుతోందని ఆమె మంత్రితో సంతృప్తిగా చెప్పారు.

– కాశీబుగ్గ

'ఒత్తిడి లేని విద్య అందిస్తాం'



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌జీయూకేటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ఒత్తిడి లేని సాంకేతిక విద్య విద్యార్థులకు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) రాష్ట్ర చాన్స్‌లర్ కేసీ రెడ్డి అన్నారు. ఎస్‌ఎంపురంలోని శ్రీకాకుళం క్యాంపస్‌లో గురువారం పీయూసీ మొదటి సంవత్సరం (ప్రీ యూనివర్సిటీ కోర్సు)లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను ఉద్దేశించి గురువారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సాంకేతిక నిపుణులను తయారు చేసే లక్ష్యంతో ఈ ట్రిపుల్ ఐటీలు ఏర్పడ్డాయని అన్నారు. రెండేళ్ల పీయూసీ, నాలుగేళ్ల ఇంజినీరింగ్ తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అత్యున్నత స్థానాల్లో విద్యార్థులు ఉంటారని అన్నారు. పాఠశాల విద్యకు, పీయూసీ, ఇంజినీరింగ్ విద్యకు తేడా ఉంటుందని తెలిపారు. ప్రతి విషయాన్ని నేర్చుకోవాలని అన్నారు.

పీయూసీలో ఇంటర్మీడియట్‌తో పోల్చితే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి సబ్జెక్టులు ఉంటాయని అన్నారు. విద్యార్థులు సబ్జెక్టుపైన, ఇంగ్లిష్‌పై దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తామన్నారు. వసతి గృహం, మెస్ విద్యార్థుల కు అనుగుణంగా నిర్వహిస్తామని, విద్యార్థులు కోరు కుంటే మెనూ కూడా మారుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి ప్రతిభ ఉందని, అందుకు తగ్గ సాధన అవసరమని తెలిపారు. విద్యార్థులను ఉత్త మ మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా విద్యా విధానం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్ డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికా రి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో

వైఎస్సార్‌సీపీదే విజయం



ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులతో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రమాణస్వీకారం చేస్తారు
- ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైపే ఉన్నారని, గత నాలుగేళ్లుగా వస్తున్న ఫలితాలే 2024లో కూడా రిపీట్ అవుతాయని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నియోజకవర్గంలో వార్డు స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన 10 మంది వార్డు సభ్యులను గురువారం నరసన్నపేట పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎన్ని కుతంత్రాలు పన్నినా రానున్నది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. తాజా సర్వేలు కూడా ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయన్నారు. టీడీపీ, జనసేన వంటి పార్టీలు ఎన్ని కలిసినా వాటికి రానున్న ఎన్నికల్లో పరాభవం తప్పదని జోష్యం చెప్పారు. వికేంద్రీకరణలో భాగంగా విశాఖలో పరిపాలనా రాజధాని రానుందని, దీంతో ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి కానుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. వార్డు స్థానాల్లో ఏకగ్రీవంగా ఎన్నికలైన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు డి.మాధురి, మహేష్, పొన్నాన సూర్యనారాయణ, గేదల లక్ష్మి, మెంటి శివానీ, చిప్పాడ రాము, కింతలి విశ్వనాథం, చిట్టి సుధారాణి, కూర్మాన సింహాచలంను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ నాయకులు చింతు రామారావు, కణితి కృష్ణ, వరుదు వంశీ, రాజాపు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'గృహ ప్రవేశాల లక్ష్యాలు సాధించాలి'



సమావేశంలో మట్లాడుతున్న స్పెషల్ సెక్రటరీ మహమ్మద్ దివాన్ మైదీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద జిల్లాకు నిర్దేశించిన గృహ ప్రవేశాల లక్ష్యాలను సాధించాలని గృహ నిర్మాణ సంస్థ స్పెషల్ సెక్రటరీ మహమ్మద్ దివాన్ మైదీన్ తెలిపారు. త్వరలో గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని, అందులో భాగంగా గృహాల ప్రగతిపై సమీక్షిస్తున్నట్లు చెప్పారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో గురువారం గృహ నిర్మాణాలపై ఉప కార్యనిర్వాహక, కార్య నిర్వాహక ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితర సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఇప్పటి వరకు జిల్లాలో 30 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేసినట్లు ప్రకటించారు. మిగిలిన 2 వేల ఇళ్లను కూడా త్వరిత గతిన పూర్తిచేసి సిద్ధం చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి చెందిన బిల్లుల చెల్లింపుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని చెల్లింపులు పూర్తి చేయాలని తెలిపారు. ఆ మేరకు ఎప్పటికప్పుడు బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, ఐరన్ సమస్యలు లేవని, కావున అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. నిర్మాణాలు పూర్తయిన వాటికి చెల్లింపులు కూడా ఎప్పటికప్పుడు నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి చేసిన పనుల తాలూకా పెండింగు బిల్లులు లేకుండా డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ద్వారా బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం రాగోలులో నిర్మితమవుతున్న గృహాలను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు అందజేశారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నాగేశ్వరరావు, అర్బన్ సహాయ ఇంజినీర్ గణేష్ ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కెనడా మైండ్ మీడియా రేడియోకు తిరుమలరావు కవిత

కొత్తూరు: కెనడాలోని తెలుగు సంఘం మైండ్ మీడియా రేడియోలో ప్రసారానికి అంతర్జాతీయస్థాయిలో తెలుగు కవితలను ఆహ్వానించింది. ఈ ప్రసారాలకు కొత్తూరు మండలం కడుము జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కడుము తిరుమల రావు రచించిన మనజాతి అజెండా–మన జాతీయ జెండా అనే కవితను ఎంపికైంది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన తిరుమలరావును పలువురు అభినందించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం యామలపేట గ్రామానికి చెందిన అమీర బాను అనే యువతి గురువారం సూపర్ వాస్మాల్–33 తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. ఇంటిలో కలహాల కారణంగా ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యుడు మహారాజ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

సీఎం వైఎస్ జగన్ ఓ టార్చ్ బేరర్

- జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ

కవిటి: మహిళల భద్రతకు దిశ చట్టం చేసి, వారి బాగోగుల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళాభ్యున్నతికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టార్చ్ బేరర్‌గా నిలిచారని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆమె గురువారం వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పన ద్వారా ఉన్నత స్థానంలో నిలిపిన సీఎం వైఎస్ జగన్ దీక్షాదక్షతకు మారు పేరుగా నిలిచారని అన్నారు. వలంటీర్ల నియామకాలలో 53 శాతం, సచివాలయ ఉద్యోగుల్లో 50 శాతం మహిళలే ఉన్నారని గుర్తు చేశారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో 75 శాతం నేరాలు తగ్గాయని, దిశయాప్ ఎందరినో కాపాడిందని పోలీసు శాఖ గణాంకాలు వెల్లడించాయని పేర్కొన్నారు. స్వేచ్ఛా కార్యక్రమం ద్వారా 7 నుంచి 12 వ తరగతి వరకున్న బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి శానిటరీ నేప్‌కిన్స్ పంపిణీకి రూ.32 కోట్ల నిధులు వెచ్చించారన్నారు. వైఎస్సార్ పెన్షన్‌కానుక ద్వారా 41 లక్షల మంది వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు అందించడం రాష్ట్ర చరిత్రలో ఓ సువర్ణాధ్యాయమని పేర్కొన్నారు. ఇంత మేలు చేస్తుంటే ఓర్వలేని దుష్ట చతుష్టయానికి, ఎల్లో మీడియాకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సైతం ఫ్యాన్ గాలికి విపక్షాలు ఉక్కిరిబిక్కిరి కావడం ఖాయమన్నారు.

విద్యలో మార్పులు అనివార్యం : వీసీ



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా విద్యలో మార్పులు అనివార్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో గురువారం పోస్టు గ్రాడ్యుయేషన్, ఒకేషనల్ జాయింట్ బోర్డాఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన వర్సిటీ ప్రగతిని పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి కేంద్ర బిందువుగా విద్య కొనసాగాలని చెప్పారు. బోధన పద్ధతుల్లో, ప్రస్తుతం ఉన్న సిలబస్‌ల్లో మార్పులు తప్పనిసరని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానం–2020 అమలు నేపథ్యంలో, 2030 తర్వాత అనేక మార్పులు చోటు చేసుకుంటాయని అన్నారు.

వర్సిటీలో నూతన విద్యా విధానం సూచనలు పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా డిగ్రీ కోర్సులు, డిగ్రీల్లో హానర్స్, పరిశోధన నాలుగేళ్ల డిగ్రీ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. నాగార్జునా అగ్రికెం, అరబిందో, కృష్ణపట్నం పోర్టు వంటి సంస్థలు సహకారంతో డిప్లమా, సర్టిఫికెట్, పీజీ డిప్లమా కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్సిటీ ఉన్న ఇంజినీరింగ్, ఆర్ట్సు, సైన్స్, కామర్స్, న్యాయ, ఎడ్యుకేషన్ ప్రతి కళాశాలలో విద్య బలోపేతమే లక్ష్యమన్నారు. పీజీలో సిలబస్, పరీక్ష విధానంలో మార్పులు అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రిజస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, చింతాడ రాజశేఖర్‌రావు, బోర్డాఫ్ స్టడీస్ చైర్మన్లు ఘంటా రమేష్, ఎస్.పద్మనాభయ్య, బి.ఎన్. పండా, ఎంవీ బసవేశ్వరరావు, ప్రసాద్‌బాబు, పి.ఎస్.అవధాని, కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

'19న వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈ నెల 19వ తేదీన బూర్జ, నందిగాం, సారవకోట, సరుబుజ్జిలి పంచాయతీల్లో జరగబోవు సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు కొరపాం, డి.మత్స్యలేశం, జోనంకి, కోమర్తి, సంతబొమ్మాళి, నర్సింగపల్లి, ఉగ్గుపురంలో దుకాణాలు, సంస్థలు, యాజమాన్యాల్లో పనిచేస్తున్న కార్మికులు ఓటర్లుగా ఉన్నవారికి వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కార్మికశాఖ ఉపకార్మిక కమిషనర్ ఎస్.డి.వి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

'లోక్ అదాలత్ విజయవంతం చేయండి'



వీసీలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పలు న్యాయస్థానాల్లో సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన గురువారం జిల్లాలోని న్యాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసేందుకు చూడాలన్నారు. కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ అదాలత్ గురించి ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు నేషనల్ అవార్డు





అవార్డు వచ్చిన ఫొటో (ఇన్‌సెట్లో) కుప్పిలి జయశంకర్

శ్రీకాకుళం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫొటో కాంటెస్ట్–2023 సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్ కుప్పిలి జయశంకర్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికైనట్లు ఏపీపీజేఏ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును ఫొటోగ్రఫీ–డే సందర్భంగా ఈ నెల 19న విజయవాడలో అందజేయనున్నారు.